# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 20 | పేజీలు: 5 | వెల: రూ.4/- | సోమవారం 8 సెప్టెంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## భారత్‌లో 100 మందికిపైగా
# ఒరాకిల్ ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం) అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఒకటైన 'ఒరాకిల్' భారతీయ టెక్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. భారత్‌లోని ఈ సంస్థకు చెందిన కార్యాలయాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగుల తొలగింపు ప్రారంభమైంది. గత వారం రోజుల్లో దాదాపు 100మందికిపైగా భారతీయ ఉద్యోగులను ఒరాకిల్ ఇంటికి పంపినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. క్లౌడ్ కంప్యూటింగ్ సహా వివిధ బృందాల్లో వందల మందిని తొలగించినట్టు ఉద్యోగంలో కొనసాగుతున్న వారి స్థానాలకు కూడా గ్యారెంటీ లేదని, కృత్రిమ మేధ వినియోగం, వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఉద్యోగాల కోతను కంపెనీ చేపట్టినట్టు ఒరాకిల్ ఉద్యోగి ఒకరు చెప్పారు.

# నేపాల్‌లో రాజకీయ సంక్షోభం

## నేపాల్ ప్రధాని ఓలీ రాజీనామా.. సైన్యం చేతుల్లోకి పగ్గాలు!



**వరుసగా మంత్రుల రాజీనామాలు**

**ఇప్పటికే ముగ్గురు మంత్రుల రాజీనామా**

**దేశం విడిచేందుకు ప్రధాని ఓలి సిద్ధమైనట్లు వార్తలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)

హిమాలయ దేశం నేపాల్‌లో రాజకీయ సంక్షోభం ముదురుతోంది. సోషల్ మీడియాపై నిషేధం ఎత్తివేసినప్పటికీ.. నేపాల్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో ప్రధాని పదవికి కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. దాంతో ఆ దేశ పగ్గాలు సైన్యం చేతుల్లోకి వెళ్లనున్నాయని తెలుస్తోంది. దీనికి ముందు ప్రధాని కేపీ శర్మ ఓలీ నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌తో

..మిగతా 2లో



## ప్రజాకవి కాళోజికి సీఎం
# రేవంత్ నివాళి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆమనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయనతో పాటు పలువు ఎంపీలు. కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతనం ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు-వేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు బయలుదేరారు.

## భారత 15వ ఉప రాష్ట్రపతిగా
# సీపీ రాధాకృష్ణన్



**ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి విజయం**

**సీపీ రాధాకృష్ణన్‌కు పోలైన 452 ఓట్లు**

**జస్టిస్ సుదర్శన్ రెడ్డికి పోలైన 300 ఓట్లు**

**15 ఓట్లు చెల్లనివిగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. ఇండియా కూటమి అభ్యర్థి బి సుదర్శన్ రెడ్డిని ఓడించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 781 ఓట్లకు గాను మొత్తం 767 ఓట్లు పోలయ్యాయి. ఎన్డీఏ అభ్యర్థి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ 452 మొదటి ప్రాధాన్యత ఓట్లు సాధించారు. ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. 15 చెల్లని ఓట్లు నమోదయ్యాయి. దీంతో మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ 152 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్డీఏ బలం 427 కాగా.. క్రాస్ ఓటింగ్ జరగడంతో 452 ఓట్లు వచ్చాయి. దీంతో దేశంలోని 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ నిలిచారు. ఈ విజయంతో బీజేపీ

..మిగతా 2లో




## ప్రభుత్వానికి ఫార్ములా
# ఈ-కార్ రేసు రిపోర్ట్

**స్పందించిన మాజీ మంత్రి కేటీఆర్**

**ఫార్ములా ఈ- కార్ రేసింగ్‌పై 2024 డిసెంబర్ 18న ఏసీబీ కేసు నమోదు**

**ఏ-1 కేటీఆర్, ఏ-2 అర్వింద్ కుమార్, ఏ-3గా బీఎల్‌ఎన్ రెడ్డి**

**ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి రిపోర్టు పంపిన ఏసీబీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)

ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన నివేదికను ఏసీబీ అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. తదుపరి ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని నివేదిక పంపారు. ఇప్పటికే ఏసీబీ మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అర్వింద్‌ను మూడు సార్లు విచారణకు పిలిచి ప్రశ్నించింది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఇద్దరిపై ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్టు సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబరు 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డిపై కేసు నమోదైంది.

స్పందించిన కేటీఆర్ : ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఏమీ లేదని, తానిక్కడే ఉంటానని ఎవరైనా వచ్చి

..మిగతా 2లో

# గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత




**లేదంటే మెయిన్స్ మళ్లీ నిర్వహించండి'**

**గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టు కీలక తీర్పు**

**గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టు రద్దు చేసిన హైకోర్టు**

**మెయిన్స్ అభ్యర్థుల పేపర్లు పునఃమూల్యాంకనం చేయాలని ఆదేశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)

గ్రూప్-1 మూల్యాంకనాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనరల్ ర్యాకింగ్స్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తాము విధించిన నిబంధనల మేరకు మళ్లీ మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. పునః మూల్యాంకనం సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్ నిర్వహించాలని స్పష్టం చేశారు. 8 నెలల్లోగా మళ్లీ మెయిన్స్ నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టును హైకోర్టు రద్దు చేసింది. మెయిన్స్ అభ్యర్థుల పేపర్లు పునః మూల్యాంకనం చేయాలని న్యాయస్థానం

..మిగతా 2లో

# కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం రేవంత్ భేటీ

**105 యంగ్ ఇండియా మోడల్ స్కూళ్లకు ఆర్థిక సాయంపై వినతి**

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసమే స్కూళ్లు అని వెల్లడి**

**గత ప్రభుత్వ అధిక వడ్డీ అప్పుల భారంపై కేంద్రానికి వివరణ**

**అప్పుల రీస్ట్రక్చరింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరిన సీఎం**

**భేటీలో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు, అధికారులు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఢిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లతో పాటు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న విద్యా పథకాలకు కేంద్ర సహకారం కోరుతూ ఆయన రెండు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందుంచారు. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు, రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.గత ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో విచక్షణారహితంగా అధిక వడ్డీలకు చేసిన అప్పులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ అధిక వడ్డీల భారం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ప్రస్తుతం ఉన్న అప్పులను రీస్ట్రక్చరింగ్ (పునర్వ్యవస్థీకరణ) చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించి, రాష్ట్రానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో 'యంగ్ ఇండియా మోడల్ స్కూళ్ల'ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందించాలని నిర్మలా సీతారామన్‌ను ఆయన అభ్యర్థించారు. ఈ రెండు అంశాలపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు సమావేశం అనంతరం సీఎం పేర్కొన్నారు.



## ప్రభుత్వానికి ఫార్ములా ఈ-కార్ రేసు రిపోర్ట్

మొదటి పేజీ తరువాయి...

లైడిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చని పరోక్షంగా ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్లు వేశారు. హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేసు కోసం అన్ని రకాలుగా ప్రయత్నించినట్లు తెలిపారు. రూ.46 కోట్లు హెచ్ఎండీఏ నుంచి ఇవ్వమని తానే ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఆ నగదు అక్కడి ఖాతాకు చేరాయని, రూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదన్నారు. తాము మాత్రం కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు, హామీలపై పోరాడతామని తెలిపారు. తనపై, ముఖ్యమంత్రిపై ఏసీబీ కేసులు ఉన్నందున ఇద్దరమూ లైడిటెక్టర్ పరీక్ష ఎదుర్కొందామని కేటీఆర్ సవాల్ విసిరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు : ఫార్ములా ఈ-రేస్‌లో ప్రతి రూపాయికి లెక్క ఉంటే అవినీతి ఎక్కడ జరిగిందని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రాసిక్యూషన్ చేసినా, ఛార్జ్ షీట్లు వేసినా ఏమీ చేయలేరని, సీఎం రేవంత్ రెడ్డి, తాను ఇద్దరం లైడిటెక్టర్ పరీక్ష ఎదుర్కొందామని సవాల్ విసిరారు. గ్రూప్-1 పేపర్ లీక్ అయిందని సమాచారం రాగానే పరీక్షలు తాము గతంలో రద్దు చేశామని, అవకతవకలు జరిగాయని యువత మొత్తుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. చివరికి కోర్టు ఏదో తప్పిదం జరిగిందని మంగళవారం తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.

రీవ్యాల్యుయేషన్‌తో ఫలితం లేదని, గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తప్పు ఎక్కడ జరిగిందో నిజం నిగ్గు తేలాలని అన్నారు. గ్రూప్-1 అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ వేసి విచారణ చేయాలని, ప్రభుత్వ పెద్దల పాత్ర, ప్రమేయం ఉందో లేదో తేలాలని అన్నారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక మంచి గుణపాఠమని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతకు న్యాయం లభించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

యువతకు అన్యాయం చేయవద్దు : గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని నిరుద్యోగులు సాక్ష్యాధారాలతో సహా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, టీజీపీఎస్సీ మొండిగా వ్యవహరించిందని కేటీఆర్ ఆక్షేపించారు. నిరుద్యోగుల ఆరోపణలు, వారు లేవనెత్తిన అంశాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖంగా ముందుకు పోయిందని ఆయన విమర్శించారు. నిరుద్యోగులపై కేసులు పెట్టి, అణచివేత, లాఠీఛార్జీకి గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు తీర్పుకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. అనేక లోపాలను దృష్టిలో ఉంచుకొని తీర్పును వెంటనే అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరారు. మళ్లీ అప్పీళ్లు, కోర్టు కేసులు అంటూ నిరుద్యోగ యువతకు అన్యాయం చేయవద్దని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

## టీపీసీసీ చీఫ్ ప్రకటనను సుప్రీంకోర్టు ముందుంచుతాం

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)




గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన పదిమంది శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్వయంగా చెప్పారని, వారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడి ప్రకటనను తాము సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళతామని ఆయన స్పష్టం చేశారు. జడ్చర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిపై చర్యలు తీసుకోవడానికి శాసనసభాపతి ఎందుకు సంకోచిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు.

## గ్రూప్-1 ర్యాంకుల నిలిపివేత

మొదటి పేజీ తరువాయి...

ఆదేశించింది. మోడరేషన్ విధానంలో పునః మూల్యాంకనం చేయాలని గౌరవ కోర్టు నిర్దేశించింది. ఈ సందర్భంగా సంజయ్ సింగ్ వర్సెస్ యూపీఎస్సీ కేసు తీర్పును జడ్జి ప్రస్తావించారు.

ఎనిమిది నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని టీజీపీఎస్సీకి హైకోర్టు సూచించింది. గ్రూప్-1 మూల్యాంకనాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో హైకోర్టు తీర్పు రిజర్వ్ చేయగా, తాజాగా గ్రూప్-1 పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు నిర్ణయం వెలువరించారు. టీజీపీఎస్సీకి రెండు ఆప్షన్లు హైకోర్టు సూచించింది. మెయిన్స్ అభ్యర్థుల పేపర్లు పునః మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. పునః మూల్యాంకనం సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్ నిర్వహించాలని ఆదేశించింది. ఎనిమిది నెలల్లో మళ్లీ మెయిన్స్ నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని : గ్రూప్-1 మెయిన్స్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం, పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు, తెలుగు మాధ్యమంలో జవాబులు రాసిన వారికి అన్యాయం జరిగిందంటూ పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సుదీర్ఘ విచారణ నిర్వహించారు. పేపర్లు దిద్దిన వారిలో ఎక్కువ మందికి తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని, దానివల్ల మార్కుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. సబ్జెక్ట్ నిపుణులతోనే జవాబు పత్రాల ముల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇటీవల ఏపీలో నిర్వహించిన గ్రూప్-1లోనూ ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులే అధిక సంఖ్యలో ఉన్నారని వెల్లడించారు. అభ్యర్థులు రాసిన జవాబుల ఆధారంగానే తప్ప మాధ్యమం ఆధారంగా ఉండవని టీజీపీఎస్సీ న్యాయవాది కోర్టుకు తెలిపారు. పిటిషినర్ల వాదనల్లో వాస్తవం లేదని వివరించారు. ఇరువైపులా వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసిన జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు. జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను రద్దూ చేస్తూ తీర్పునిచ్చారు.



## నేపాల్‌లో రాజకీయ సంక్షోభం

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్లిష్ట పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు, ప్రధాని నివాసం నుంచి సురక్షితంగా వెళ్లిపోయేందుకు మిలిటరీ సహాయం కావాలని ఆయన అడిగినట్లు పేర్కొన్నాయి. అయితే ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఓలీకి ఆర్మీ చీఫ్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలను సైన్యం అదుపులోకి తీసుకువస్తుందని పేర్కొన్నట్లు సమాచారం. ఓలీ రాజీనామా చేస్తే.. మిలిటరీ రంగంలోకి దిగేందుకు సిద్ధమైనట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ తరుణంలోనే రాజీనామా ప్రకటన వెలువడింది.

### ఆర్మీ బ్యారక్స్‌కు వీఐపీలు..

దేశంలోని అస్థిర పరిస్థితుల వేళ.. త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. అన్ని విమానాలను రద్దు చేశారు. 300 మంది సైనికులను అక్కడ మోహరించారు. మంత్రులను వారి అధికారిక నివాసాల నుంచి ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ వద్ద హెలికాప్టర్ల కదలికలు కనిపిస్తున్నాయి. అలాగే రాజధాని కాఠ్‌మాండూలోని ఆర్మీ బ్యారక్స్‌లోకి వీఐపీలను తరలిస్తున్నారు.

### పార్లమెంట్‌లోకి చొరబడిన నిరసనకారులు..

సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్ (%చీవజ్ఝుఖశ్రీ%)లో జరిగిన ఆందోళనల్లో అత్యధికమంది యువత, పాఠశాల విద్యార్థులే పాల్గొనడం గమనార్హం. దీంతోపాటుగా రాజకీయ వారసత్వాలపై నిరసనలు కూడా మొదలయ్యాయి. వీటిని నెపోకిడ్ మూమెంట్‌గా పిలుస్తున్నారు. సంపన్న వర్గాల, రాజకీయ నాయకుల పిల్లలు అవినీతి సొమ్ముతో వచ్చే ఫలాలను అనుభవిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చి.. నిరసనకారులు పార్లమెంట్‌లోకి దూసుకువెళ్లారు. ఆ భవనానికి నిప్పంటించారు. మరోపక్క భక్తాపుర్‌లోని కేపీ శర్మ ఓలీ వ్యక్తిగత నివాసానికి నిప్పుపెట్టిన నిరసకారులు.. అది కాలిపోతుంటే డ్యాన్సులు చేస్తోన్న దృశ్యాలు మీడియాలో చక్కర్లు కొట్టాయి.

### ఇండిగో విమానాల దారి మళ్లింపు..

దిల్లీ నుంచి కాఠ్‌మాండూ బయల్దేరిన రెండు ఇండిగో విమానాలకు త్రిభువన్ విమానాశ్రయం నుంచి క్లియరెన్స్ లభించలేదు. దాంతో వాటిని దారి మళ్లించాల్సి వచ్చింది. అవి లఖ్‌నవూలో ల్యాండ్ కావాల్సి వచ్చింది. ఈ పరిణామాల వేళ భారత రాయబార కార్యాలయం టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసింది. 977-9808602881, 977-9810326134 నంబర్లను అందుబాటులో ఉంచింది.



## భారత 15వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

మొదటి పేజీ తరువాయి...

శ్రేణుల్లో ఆనందం వెల్లువిరిసింది. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసంలో ఎన్డీఏ ఎంపీల వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఫలితాలు ప్రకటించిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జోషి నివాసాన్ని సందర్శిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా.. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన ఓటింగ్ ఈరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంట్ హౌస్‌లో జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ 10 గంటల సమయంలో తొలి ఓటు వేశారు. అనంతరం ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 781 మందిలో మొత్తం 768 మంది ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వాస్తవానికి.. భారత పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభతో సహా మొత్తం 788 మంది ఎంపీలు ఉండాలి. ప్రస్తుతం రెండు సభలలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అయితే.. మొత్తం 781 మంది ఎంపీలు ఓటు వేయాల్సి ఉంటుంది. వారిలో 13 మంది ఓటింగ్‌లో పాల్గొనలేదు. వీరిలో బీఆర్ఎస్ నుంచి 4, బీజేడీ నుంచి 7 మంది, శిరోమణి అకాలీదళ్ నుంచి ఒకరు, మరో స్వతంత్ర ఎంపీ ఓటు వేయలేదు. ఎన్డీఏకు చెందిన 427 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగిన సీపీ రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)

భారత 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ దక్షిణ భారతదేశంలో బీజేపీ నేతల్లో కీలకమైనవారు. "తమిళనాడు మోదీ"గా పార్టీలో ఆయనకు పేరుంది. బీజేపీలో అత్యంత విశ్వాసపాత్రుడు, వివాద రహితుడిగా చెబుతారు. 1957 అక్టోబరు 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించిన సీపీ రాధాకృష్ణన్ 16వ ఏట నుంచి ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్‌లతో కలిసి పనిచేశారు. ఇప్పుడు ఆ అనుభవమే దేశ రెండో అత్యున్నత పదవిని అధిష్ఠించేస్థాయికి తీసుకెళ్లింది.

### రాజకీయ జీవితం

సీపీ రాధాకృష్ణన్ 1957 అక్టోబరు 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. ఆయన పూర్తి పేరు చంద్రపురం పొన్నుసామి రాధాకృష్ణన్. ఇందులో పొన్నుసామి ఆయన తండ్రి పేరు. బీబీఏ పట్టభద్రుడైన సీపీ రాధాకృష్ణన్, కళాశాల రోజుల్లో టేబుల్ టెన్నిస్, అథ్లెట్‌గా ఉన్నారు. క్రికెట్, వాలీబాల్ క్రీడలపై అమితాసక్తి కనబరిచేవారు. భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ స్థాయికి చేరుకోవాలనే కోరికతో ఆయన పేరునే రాధాకృష్ణన్‌కు ఆయన తల్లి పెట్టారు. సీపీ రాధాకృష్ణన్ 16వ ఏట నుంచి ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్‌లతో కలిసి పనిచేశారు. కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి 1998, 1999 ఎన్నికల్లో పోటీచేసి గెలిచారు. 2004 నుంచి 2007 వరకు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. అప్పట్లో 93 రోజులపాటు తమిళనాడులోని ప్రతి నియోజకవర్గాన్ని చుడుతూ 19వేల కిలోమీటర్ల మేర రథయాత్ర నిర్వహించి నదుల అనుసంధానం, అంటరానితనం, ఉగ్రవాదం నిర్మూలన గురించి ప్రచారం చేపట్టారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసిన రాధాకృష్ణన్ 3.89 లక్షల ఓట్లతో రెండోస్థానానికి పరిమితమయ్యారు. 2019 ఎన్నికల్లోనూ కోయంబత్తూరు స్థానం నుంచి పోటీచేసిన రాధాకృష్ణన్ ఓటమి పాలయ్యారు.

### గవర్నర్‌గా సేవలు

2023 ఫిబ్రవరి 12న తొలిసారి ఝార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. 2024 మార్చి 19న అప్పటి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజీనామాతో ఆ మరుసటిరోజు నుంచి తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 జులై 27న మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయిన ఆయన, ప్రస్తుతం అక్కడే సేవలందిస్తున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గెలిచిన ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకటరామన్‌ల తర్వాత తమిళనాడు నుంచి ఆ పీఠాన్ని అధిష్ఠించిన మూడో వ్యక్తిగా రికార్డులకెక్కారు.

### అంచెలంచెలుగా ఎదుగుతూ!

సీపీ రాధాకృష్ణన్ 1998, 1999లో ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ-జౌళి ఛైర్మన్‌గా, పార్లమెంటరీ కమిటీ-పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్, కన్సల్టేటివ్ కమిటీ, స్టాక్ ఎక్స్ఛేంజ్ అక్రమాలపై దర్యాప్తునకు సంబంధించిన పార్లమెంటరీ ప్రత్యేక కమిటీలలో సభ్యుడిగా పనిచేశారు. 2004లో పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో భాగంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రసంగించారు. తైవాన్‌కు వెళ్లిన మొదటి పార్లమెంటరీ ప్రతినిధి బృందంలోనూ ఆయన సభ్యుడిగా ఉన్నారు. సీపీ రాధాకృష్ణన్ 2016 నుంచి 2020 మధ్యకాలంలో కాయిర్-కొబ్బరి పీచు బోర్డు ఛైర్మన్‌గా సేవలందించారు. 2020లో కేరళ భాజపా వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమితులై 2022 వరకు పనిచేశారు. ఇలా అంచెలంచెలుగా ఎదుగుతూ, ప్రస్తుతం దేశ రెండో అత్యున్నత పదవికి ఎన్నికయ్యారు.

## విటులపై కేసు నమోదు చేయొచ్చు

త్రివేండ్రం: వ్యభిచార గృహంలో సెక్స్‌వర్కర్ నుంచి సేవ పొందుతున్న విటుడిపై అనైతిక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద కేసు నమోదు చేయవచ్చునని కేరళ హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. ఎందుకంటే అలాంటి సేవలకు చెల్లింపులు వ్యభిచారాన్ని ప్రేరేపించడమే అవుతుందని పేర్కొంది. సెక్స్ వర్కర్లను వాణిజ్య లావాదేవీలలో వస్తువుగా పరిగణించ రాదని జస్టిస్ వీజీ అరుణ్ కీలక తీర్పు చెప్పారు. వ్యభిచార గృహాలలో సేవలు కోరుతున్న విటులు సెక్స్ వర్కర్ల దోపిడీలో చురుకైన భాగస్వాములు కాబట్టి, వారిని కేవలం కస్టమర్లుగా పరిగణించలేమని తెలిపారు. ఒక వ్యక్తిని వినియోగదారుడిగా పరిగణించాలంటే అతను ఏదైనా వస్తువు లేదా సేవలను కొనుగోలు చేయాలని, అయితే సెక్స్ వర్కర్‌ను ఒక వస్తువుగా, ఆమె అందించే లైంగిక సుఖం ఒక సేవగా పరిగణించలేమని తెలిపింది. అలాంటి వృత్తిలో ఉన్న వారిని మానవ అక్రమ రవాణా ద్వారా తీసుకువచ్చి బలవంతంగా ఆ వృత్తిని చేయిస్తుంటారని, వారు ఒక విధంగా బాధితులేనని ఆయన తీర్పులో పేర్కొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించాలి

కొత్తకోట, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం.) కొత్తకోట: కొత్తకోట మండలంలోని కానాయ పల్లి గుంపుగట్టు దగ్గర ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌస్ లో గత ఏడు సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, కార్మికులకు పెండింగ్ లో ఉన్న జీతాలు ఇప్పించాలని మిషన్ భగీరథ ఈఏ గారికి టి.యు. సి. ఐ ఆధ్వర్యంలో కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టి. యు. సి.ఐ జిల్లా కార్యదర్శి పి. అరుణ్ కుమార్ మాట్లాడుతూ మిషన్ భగీరథ చల్లా కంపెనీ సబ్ కాంట్రాక్టర్ లింగారెడ్డి దగ్గర పని చేస్తున్న కార్మికులందరికీ గత పది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని.ఈ విషయంపై గత వారం రోజుల క్రితం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని చెప్పారు .కలెక్టర్ వారం రోజులలో మీ జీతాల సమస్య పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ పది రోజులు గడుస్తున్న కార్మికులకు ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కాంపౌండ్ లో పనిచేస్తున్న మెగా వర్కర్స్ కి మాత్రం ప్రతి సంవత్సరం బోనస్ ,ఈఎస్ఐ ,పీఎఫ్ అన్ని ఇవ్వడం జరుగుతుందని వేతనాలు కూడా ప్రతి నెల క్రమము తప్పకుండా ఇస్తున్నారుని, కానీ అదే కాంపౌండ్ లో పనిచేస్తున్న చల్లా కంపెనీ వర్కర్స్ కు మాత్రం బోనస్ లేదు ఈఎస్ఐ,పిఎఫ్,


వినతి పత్రాన్ని అందజేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

కూడా ఇవ్వడం లేదని జీతాలు లేక కార్మికులు కనీసం రోజువారిగా నిత్య అవసరాలు కూడా కొనలేని పరిస్థితిలో కార్మికులు ఉన్నారని చెప్పారు. అధికారులు మాత్రం సబ్ కాంట్రాక్టర్ అయినా లింగారెడ్డి పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, వెంటనే జీతాలు ఇప్పించాలి కోరారు.పై విషయాలను వారం రోజులలో పరిష్కరించకపోతే కార్మికులకు సమ్మె తప్ప మరొక మార్గం లేదని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలోటి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, మిషన్ భగీరథ వర్కర్స్ జిల్లా కార్యదర్శి కార్యదర్శి శేఖర్, వర్కర్స్ విజయ్, నిరంజన్,పి. కురుమూర్తి,సంతోష్, టి వెంకటయ్య,బి వెంకటయ్య,వంశీ,గోవర్ధన్, బాలు తదితరులు పాల్గొన్నారు.




## యూరియా సరఫరా కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు

### జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం) జిల్లాలో రైతులకు సరఫరా అవుతున్న యూరియ కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు.మంగళవారం గద్వాల టౌన్ లో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన యూరియా సరఫరా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ రైతులకు యూరియ కోసం ఇస్తున్న టోకెన్స్ విధానాన్ని పరిశీలించారు. రైతులకు సరఫరా చేస్తున్న యూరియా సంబందించిన వివరాలను వ్యవసాయ శాఖ అదికారులు ఎస్పీ కి వివరించారు. గోదాంలలో నిల్వ ఉంచిన ఎరువులను కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే పంపిణీ చేయాలని అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని యూరియాను సకాలంలో అందించాలన్నారు. రైతులకు ఎరువులు సమయానికి అందేలా చూడాలని అక్కడి అధికారులకు ఆదేశించడం జరిగింది. జిల్లా ఎస్పీ అక్కడ ఉన్న రైతులతో మాట్లాడుతూ... వారు ఎలాంటి పంటల వేశారు, వారికి ఇప్పటిదాకా ఎంత యూరియా అందింది ఇంకా ఎంత అవసరం అవుతుంది అనే విషయాలను రైతులను అడిగి తెలుసుకన్నారు. తదుపరి జిల్లాలో రైతులకు ఇబ్బంది కలగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వై .మొగిలయ్య , గద్వాల్ సిఐ శ్రీను, గద్వాల్ టౌన్ ఎస్సై కళ్యాణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు .

అంగన్వాడి కేంద్రంలో కోడిగుడ్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



## అంగన్వాడి కేంద్రంలో అందజేస్తున్న కోడిగుడ్లు తాజాగా ఉండాలి

### చిన్నారులు పౌష్టిక ఆహారాన్ని ఇష్టంగా తినాలి

### అంగన్వాడీ కేంద్రంపై పిల్లల్లో ఇష్టత పెంచాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జనగామ, సెప్టెంబర్ 09 (నమస్తే ఉదయం): జిల్లా లోని దేవరుప్పుల మండలం పెద్దమదూరు గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విస్తృతంగా పర్యటించి జిల్లా పరిషత్ హై స్కూల్, అదే కాంపౌండ్ లో ఉన్న ప్రైమరీ స్కూల్ ,అంగన్వాడి కేంద్రం ల నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోని చిన్నారుల ను పలకరించారు. పౌష్టికాహారం కొరకు నిలువ చేసిన వస్తువులను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నారులు అమితంగా ఇష్టపడే పదార్థాలను గ్రహించి వాటిని అందచేసే విధంగా టీచర్లు కృషి చేయాలన్నారు. చిన్నారులకు గర్భిణీలకు పౌష్టిక ఆహారం కోసం అందజేస్తున్న భోజనం కోడిగుడ్లు తాజాగా ఉండాలన్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఏర్పాటుచేసిన ప్రైమరీ స్కూల్ విద్యార్థుల ను పలకరించారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందినవా లేవా అని అడిగి తెలుసుకున్నారు.హై స్కూల్ లో తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు పరీక్షల సమయం సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలన్నారు. మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలనకై డిజిటల్ బోధనను పరిశీలించారు.అభ్యాసన సామర్థ్యాలు విద్యార్థుల్లో రోజు రోజుకు పెరుగుతూ ఉండాలి. విద్య పై విద్యార్థుల్లో ఆసక్తి పెంచి,. విద్యార్థులు కూడా అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు.మధ్యాహ్నం భోజనం పథకం ను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆఫీసును సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల నమోదు శాతం ఎట్టి పరిస్థితుల్లో తగ్గరాదని, నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలనకై గ్రామంలో పర్యటించి ఇండ్ల నిర్మాణాలను సందర్శించారు ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగు ఇండ్లకు విద్యుత్ తీగల సమస్య ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత వివరాలను అడిగి తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే ఇసుక, కంకర, స్టీలు ధరల నియంత్రణకు సంబంధిత యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని మండల అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్ణీత సమయంలో గా నిర్మించుకుంటేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారులకు తెలియచెప్పారు.కలెక్టర్ వెంట మండల అధికారులు తాసిల్దార్ ఆండాలు, ఎంపీడీవో సురేష్, ఎంఈఓ కళావతి, ఆర్. ఐ. రాజు, పంచాయతి సెక్రటరీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కాళోజి జయంతి సందర్బంగా చిత్ర పటానికి పూలమాల వేస్తున్న జిల్లా కలెక్టర్

## కాళోజి సేవలు చిరస్మరణీయం

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, సెప్టెంబర్ 09 ( నమస్తే ఉదయం):తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్,బెన్న లోమ్ తో కలిసి కలెక్టర్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీహనారాయణరావు అని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతోహా గౌరవించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా కాళోజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జే.బి.రాజు

## సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలి

### షెడ్యూల్డ్ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ జే.బి.రాజు, వైస్ చైర్మన్ బొమ్మెర శ్రీనివాస్

### ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయం పై బస్సు యాత్ర

జనగామ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం): ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయం పై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని షెడ్యూల్డ్ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ జే.బి.రాజు (ఐఐఎస్ విఆర్ఎస్), వైస్ చైర్మన్ బొమ్మెర శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం హైదరాబాద్ చిక్కడపల్లిలోని టీయు జేఏసీ ఉద్యమకారుల కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్ సిహెచ్. అవిలయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జే.బి.రాజు, వైస్ చైర్మన్ బొమ్మెర శ్రీనివాస్, డాక్టర్ జహంగీర్ హుస్సేన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోతే బస్సు యాత్ర చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఏజెన్సీ ప్రాంత ఎస్సీల సమస్య అయిన రాజ్యాంగపరమైన జడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని లక్షలాదిమంది ఎస్సీ కులాలకు మండల పరిషత్ లో, జిల్లా పరిషత్ లో కుర్చీ లేకుండా చేస్తూ అవమానం, అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2025 స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాలకు ప్రాతినిధ్య కల్పించకుండా చేస్తే దశల వారీగా ఉద్యమాన్ని రగిలిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన తప్పిదం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే ఏజెన్సీ ప్రాంతంలో బస్సు యాత్ర చేపట్టి ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ తెలంగాణ రాష్ట్ర గౌరవ సలహాదారు గొల్లపల్లి దయానంద రావు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ కన్వీనర్ గోడ రమేష్, బీఎస్పీ పార్టీ మాజీ అధ్యక్షుడు నల్ల సూర్యప్రకాష్, సీఎల్ యాదగిరి, కమల రమేష్, మహమ్మద్ ఖాన్ వై.బాలరాజు, కె.మహేందర్, సత్యనారాయణ రెడ్డి, ఎం.సూర్యనారాయణ, ఆర్.ఎం.రాజు, జిమ్మిడి సుమన్, ఎండి.ఖాన్, సాయి కుమార్, చింతల తిరుపతి, జనగాం రాజేశ్వరరావు, కె.శంకర్రావు, మన్యం మహేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జరిగిన కాళోజీ జయంతి

## ఘనంగా జరిగిన పద్మ విభూషణ్ ప్రజాకవి కాళోజీ జయంతి వేడుక

### తెలంగాణ ప్రజల భాష ఉద్యమ కేరటం కాళోజీ

### తెలంగాణ తొలి పొద్దు కాళోజీ

### జి జే సీ ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి

జనగామ, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం) జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్మక%శీ%చ లో మంగళవారం కాళోజీ జయంతి ఘనంగా జరిగింది. ఈ జయంతి వేడుకలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి మాట్లాడుతూ 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి-అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు గారని, రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట అని 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడన్నారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరిపెల్ల రవిప్రసాద్ విద్యార్థులతో. నా గొడవ పుస్తకంలో "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా సమాజానిది " అని "సామాన్యుడే నా దేవుడు" అని, "హింస తప్పు...రాజ్య హింస.. మరీ తప్పు" అని "తొలగి తొవ్వనించువాడు ఎవడు... తోసుకు పోవాలి గాని అని తన రచనల ద్వారా మేల్కొల్పిన ప్రజా కవిగా, తెలంగాణ భాషా కవిగా, తెలంగాణ తొలి పొద్దుగా కాళోజీ నిలిచారాన్నా రు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు భూక్యా సేవా, డాక్టర్ పస్కుల శ్రీనివాస్, శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, వరుధిని, రజిత, గణేష్, ఇశ్రాత్ భాను, ముక్తాదిర్, నాగేందర్. కరుణాకర్ , ప్రియదర్శిని, రేఖ,శంకర్, షహనాజ్ మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## గద్వాల్ టౌన్, సీసీ ఎస్ పోలీస్ స్టేషన్‌లని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం) గద్వాల్ టౌన్, సీ.సీ.ఎస్. పోలీస్ స్టేషన్ లను మంగళవారం జిల్లా ఎస్పీ టి . శ్రీనివాస రావు ఆకస్మిక%శీ%గా సందర్శించి, తనిఖీ చేశారు. మొదటగా గద్వాల్ టౌన్ స్టేషన్ ను సందర్శించి పరిసరాలను, ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు. రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్ ను పరిశీలించారు. స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, బీట్ డ్యూటీ బుక్స్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్ తదితర రికార్డ్స్ ను తనిఖీ చేశారు. గద్వాల్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి వివరాలు, మ్యాప్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని అన్నారు, డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని , సిబ్బంది తమకు కేటాయించిన కాలనీలలో పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. అనంతరం గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సీసీ ఎస్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు.అందులో భాగంగా సీ.సీ.ఎస్. సి.ఐ. ఇప్పటి వరకు వారి సిబ్బంది ఛేదించిన కేసుల వివరాలను ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్టేషన్ పరిసరాలను పరిశీలి%శీ%చడంతో పాటు, స్టేషన్ లోని సిబ్బంది గదులను పరిశీలించారు. స్టేషన్ లో "5%౦% "అమలు చేయాలని, అన్ని రికార్డులు క్రమపద్ధతిలో ఉంచుకోవాలని ఆదేశించారు. సీసీ ఎస్ పోలీస్ స్టేషన్ కు కేటాయించిన కేసులను ఎప్పటికప్పుడు త్వరగా చేయించాలని సూచించారు. చివరగా రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో నూతన పెట్రోల్ బంక్ కోసం ఉన్న స్థలాని పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డి. ఎస్పీ వై.మోగిలయ్య, గద్వాల్ సి ఐ శ్రీను, సీ.సీ.ఎస్. పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రవి, టౌన్ ఎస్సై కళ్యాణ్ , సిబ్బంది పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషాదినోత్సవం, గురుపూజోత్సవ వేడుకలు




అత్తాపూర్‌లో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలలో పాల్గొన్న ఉపాధ్యాయులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం లో కాళోజీ నారాయణ రావు జయంతి లో పాల్గొన్న అధికారులు

బుద్వేల్, సెప్టెంబరు 9 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మంగళవారం ప్రధానోద్యాయురాలు డాక్టర్ ఎం సుగుణ రెడ్డి ఆద్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవంగురించి, పద్యం -పోటీలు, ఉపన్యాస పోటీలు, కథల పోటీలు, పాటల పోటీలు నిర్వ-హించడం జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందులో గెలుపొందిన వారికి బహుమతులు డాక్టర్ ఎం సుగుణ రెడ్డి చేతులమీదుగా అందచేశారు. ఉపాద్యాయులు తెలంగాణ భాష గురించి, కాళోజి నారాయణీరావు భాషకు చేసిన సేవల గురించి వివరించారు. గురుపూజోత్సవంలో బాగంగా విద్యార్థుల చేత గురువలందరు సన్మానం పొందారు, ఇట్టి కార్యక్రమాలు ఎంతో ఘనంగా నిర్వహించారు

### అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో....

కాళోజీ నారాయణ రావు జయంతి ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలుగు భాషా దినోత్సవం గా ప్రకటించిందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత తెలిపారు . మంగళవారం పాఠశాల లో కాళోజీ నారాయణ రావు జయంతి ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు .కర్ణాటక లోని బీజాపూర్ ప్రాంతంలో జన్మించిన కాళోజీ తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఈరోజు తెలంగాణ రాష్ట్రం సిద్ధించడానికి తను రాసిన నా గొడవ కూడా ఒక భాగం అని అన్నారు . కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు శ్రీనివాస్ సాగర్, లింగరాజు, కవిత లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు రజియా బేగం, సాయి ప్రసాదరావు, పిడి రంగారెడ్డి, సుజాత, రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం సుగుణ రెడ్డి

### వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కాళోజీ జయంతి.......

ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ లోని పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్ కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాళోజీ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. కాళోజీ నారాయణరావు బహుభాషా కోవిదుడని రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలని కోరారు.




ఈవీఎం గోదాము ను వివిధ పార్టీల నాయకులతో కలిసి
తనిఖీ చేయడానికి వచ్చిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కె చంద్రారెడ్డి

## రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోదామును పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ కె చంద్రారెడ్డి

బుద్వేల్, సెప్టెంబరు 9 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ ఎమ్మార్వో కార్యాలయం వెనుకాల గల ఈవీఎం గోదాము ను మంగళవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి వివిధ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి అంజన్ కుమార్ గౌడ్, వై శ్రీధర్, కోరని బాల్ రాజ్ , కన్యగారి నర్సింహారెడ్డి , తాహెర్ , రాజేంద్రనగర్ తహసిల్దార్ బి రాములు పాల్గొన్నారు.

# అమర్నాథ్ రెడ్డికే పోలీసుల అండదండలు

### అదుపులో నుండి తప్పించిన పోలీసులు.

### బిల్డింగ్ యజమానులపై దాడి చేసిన నిందితుడు గచ్చిబౌలి తిరుగుతున్న పట్టించుకోని పోలీసులు

శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 9, ( నమస్తే ఉదయం) కోర్టు ఆదేశాల ప్రకారం తమ ప్లాట్లను ఖాళీ చేయించేదుకు కోర్టు బిలీఫ్ సహాయంతో వెళ్లిన ప్లాట్ యజమానులపై దాడి చేసిన సంఘటనలు ప్రధాన నిందితుడు అమర్నాథరెడ్డిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడంతో పలు అనుమానం వ్యక్తమవుతున్నాయి. గచ్చిబౌలి పరిధిలో హైటెక్ సిటీ హాస్టల్ అసోసియేషన్ పేరుతో వీళ్ళు సాగిస్తున్న అరాచకంపై స్థానిక బిల్డింగ్ యజమానులు అనేకమార్లు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమర్నాథ్ అసోసియేషన్ ని అడ్డం పెట్టుకుని అనేక దౌర్జన్యాలకు పాల్పడుతున్న పోలీసులు రాజకీయ నాయకులు గాని బిల్లింగ్ యజమానులకు కనీసం మద్దతు ఇవ్వకపోవడంపై ప్లాటు యజమానులు వాపోతున్నారు. పోలీసులకు ఆమ్యామ్యాలు అందించడంతో పాటు సిబ్బందికి భోజన వసతులు కల్పిస్తున్నాడని అందుకే సదరు నిందితుడిని కాపాడేందుకు పోలీసులు విఫల ప్రయత్నాలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసోసియేషన్ లో 100కు పైగా హాస్టల్ నిర్వాహకులు సభ్యులుగా ఉన్నారు. ప్రతి హాస్టల్ నుండి నెలకు కొంత డబ్బులను ఖర్చు కోసం వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఖర్చుల నిమిత్తం తీసిన సోమ్ము లో కొంత పోలీసుల చేతులు తడుపుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దాంతోపాటు ప్రతి హాస్టల్లో ఐదు నుండి పదిమంది పనిచేస్తున్నారని వాళ్లంతా ఎన్నికల్లో తమకే సపోర్టు చేస్తారని రాజకీయ నాయకులను నమ్మిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఓటు బ్యాంకు అని రాజకీయ నాయకులకు చెప్పి అమర్నాథ్ రాజకీయ పలుకుబడి తో బిల్డింగ్ యజమానులను భయపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. దాడిసమయంలో ప్రధాన నిందితుడు ప్లాటు ఓనర్స్ పట్టుకుని అప్పగిస్తే స్టేషన్ నుండి పారిపోయాడని చెబుతున్న పోలీసులు చెప్పటం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు. పోలీసులు అండతోటే అమర్నాథ్ తప్పించుకుని తిరుగుతూ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు నాటు ఓనర్స్ ఆరోపిస్తున్నారు.

### రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కార్పొరేటర్ గా అమర్నాథ్

వచ్చే ఏడాది జరగబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో తాను కార్పొరేటర్ గా పోటీ చేయనున్నట్లు అమర్నాథ్ ప్రచారం చేసుకుంటున్నారు. గచ్చిబౌలి డివిజన్లో డివిజన్ లో సుమారు 100 హాస్టల్ పైన ఉండడంతోపాటు అందులో ఉంటున్న ఐటీ ఉద్యోగులు హాస్టల్ నిర్వాహకులు తమ జిల్లాకు చెందిన వారు చాలామంది ఈ డివిజన్లో ఉన్నారని అందరూ తనకు మద్దతు ఇస్తారని తను సునాయసంగా కార్పొరేటర్ గా గెలుస్తానని ప్రచారం చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీ నుండి టికెట్ రాకపోయినా స్వతంత్రంగా నైనా పోటీ చేయాలని సిద్దమవుతున్నాడు. అందులో భాగంగానే తన ప్రభావం పెంచుకోనేదుకు అసోసియేషన్ వాడుకుంటున్నాడు. అసోసియేషన్ నుండి ఎవరో ఒకరు ఉంటేనే హాస్టల్ నిర్వాహకులకు న్యాయం జరుగుతుందని అధికారులతోనూ నాయకులతోనూ మన సమస్యలను



అమర్నాథ్ రెడ్డి ఫైల్ ఫోటో

వివరించుకునేందుకు అవకాశం దొరుకుతుందని అసోసియేషన్ సభ్యులకు నూరి పోస్తున్నాడు. జిహెచ్ఎంసి ఎన్నికల కోసం ప్రత్యేకంగా 6 నుండి 7వేల కొత్త ఓట్లు చేర్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతుంది. రాజకీయ పార్టీలు పోలీసులు సహకారం అసోసియేషన్ మద్దతు తన కలిసి వస్తాయని ధీమాతో ముందుకు వెళ్తున్నాడు. ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని ఇప్పటి నుంచి ప్రణాళికలు తయారు చేసుకుని అసోసియేషన్ ఉండే ప్రధాన సభ్యులను వెంటవేసుకొని తిరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

### కరోనా నుండే అమరేంద్రుడు ఆగడాలు

కరోనా సమయంలో హైటెక్ సిటీ హాస్టల్ అసోసియేషన్ ఏర్పాటు చేసి అమర్నాథ్ రెడ్డి అప్పటి నుండే దౌర్జన్యాలను ప్రారంభించాడు. తనకు తానే అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ప్రకటించుకోని హాస్టల్ నిర్వాహకులను సభ్యులు చేర్చుకొని సమావేశాలు పెట్టి హాస్టల్ పిల్లలు అందరు ఇళ్లకు వెళ్లిపోయారని కిరాయిలు కట్టలేమని నిర్వహకులకు నూరిపోసాడు. దీంతో హాస్టల్ నిర్వహకులకు ఆశా దీపంగా కనపడ్డాడు. కిరాయిలు చెల్లించలేమని బిల్డింగ్ యజమానులకు చెప్పారు. తాము చాలా నష్టాలు ఉన్నామని కనీసం కరెంట్ బిల్లు కూడా కట్టుకోలేని స్థితిలో ఉన్నామని పోలీసుల ద్వారా బిల్డింగ్ యజమానులపై ఒత్తిడి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. బిల్డింగ్ యజమానులు తాము కూడా లోన్లు మీద ఇళ్ళు నిర్మించుకున్నామని ప్రతినెల బ్యాంకులకు ఈ ఎం ఐ చెల్లించాల్సి ఉందని కిరాయి ఇవ్వకపోతే ఖాళీ చేయమని వాదనకు దిగారు. హాస్టల్ అసోసియేషన్ సభ్యులు బిల్లింగ్ అభిమానులు కూర్చుని 50 శాతం కిరాయి ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చుకున్నారు. కొన్ని రోజుల తర్వాత 50 శాతం కూడా ఇవ్వలేమని తను చాలా ఇబ్బందుల్లో ఉన్నామని అప్పటి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కలిసి బిల్డింగ్ యజమానులను ఒప్పించాలని అమర్నాథ్ చాలా ప్రయత్నం చేశాడు. అయితే సిపి ఇరువర్గాలు కూర్చుని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటినుండే బిల్లింగ్ యజమానులకు కిరాయిలు ఎగ్గొట్టడం కోర్టులలో కేసులు వేయడం దౌర్జన్యం చేయడం ప్రారంభించాడని బిల్లింగ్ యజమానులు చెప్తున్నారు. గడచిన రెండు నెలల్లో మూడు హాస్టల్లో యజమానులపై దాడి చేయడం జరిగిందని పోలీసులు మాత్రం తమ పిర్యాదు తీసుకోనే వారు కాదని అన్యాయం చేసిన అమర్నాథ్ ఫిర్యాదుపైనే స్పందించి బిల్డింగ్ యజమానులపై కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని వారు వాపోయారు. ఏది ఏమైనా గచ్చిబౌలి పరిధిలో అమర్నాథ్ అన్యాయపు జైత్రయాత్ర పోలీసుల సహకారంతో విజయవంతంగా సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోడూరు మెన్స్ ప్లాట్లు యజమానులపై దాడి జరిగి 15 రోజులు కావస్తున్న ప్రధాన నిందితుడైన అమర్నాథ్ రెడ్డి అరెస్టు చేయకపోవడం పోలీసులు ఎంత సహకారం అందిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

### సీపి ఆదేశాలు బేఖాతారు

దాడిలో పాల్గొన్న 40 మందిని అరెస్టు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలను సైతం బేఖాతారు చేయడం చర్చనీయంగా మారింది. ఫిర్యాదు చేసి 15 రోజులు అవుతున్న ఇప్పటివరకు 6 మందిని అరెస్టు చేయడం పోలీసుల పనితనానికి నిదర్శనం. అమర్నాథ్ రెడ్డి గచ్చిబౌలిలో అడుగుపెట్టిన తర్వాత అనేక అరాచకాలు సృష్టించడం తోపాటు స్థానికులపై సైతం దాడులు పెరిగిపోయాయని స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతుంది. అమర్నాథ్ రెడ్డి పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కనీసం కంప్లైంట్ కూడా పోలీసులు తీసుకోవడం లేదు. అమర్నాథ్ రెడ్డి పిర్యాదు చేసిన వారిపైనే పోలీసులు కేసులు పెడుతున్నారని బిల్డింగ్ యజమానులు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న అమర్నాథ్ పై చర్య తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమ కేసులతో భయపెడుతూ రౌడీయిజం చేస్తున్న నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బిల్డింగ్ యజమానులతో పాటు స్థానికులు కోరుతున్నారు.




## ప్రధానమంత్రి మోడీకి పాలాభిషేకం చేసిన కంచి మహేందర్

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయంకూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు కంచి మహేందర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోడీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం దేశ ప్రజలందరికీ ఎంతో మేలు చేస్తుంది అని సాధారణ కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడమే కాకుండా వ్యాపారులకు, రైతులకు కూడ ఊరటనిస్తుంది అని తెలియజేశారు. ప్రజల హితాన్ని కోరే ప్రధానమంత్రి మోడీ సేవలు ఎల్లప్పుడూ పేదలకు అనుకూలంగా ఉంటుందని తెలియజేసారు. దేశంలో పేదలు అనుభవిస్తున్న ఆర్థిక బాధలను చూసి కేంద్రం భారీ స్థాయిలో జిఎస్టి తగ్గుదల చేయడం తో సామాన్యులకు భారీ స్థాయిలో మేలు జరగడంతో ఫతేనగర్ డివిజన్ బిజెపి శ్రేణులు భారీ సంఖ్యలో చేరుకొని మోడీకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి, కూకట్ పల్లి రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ జిఎస్టి 28%, 12 % స్లాబులతో ఉండడంతో ముఖ్యంగా పేద ప్రజలుపై పడుతున్న అర్థిక భారం పడుతున్న విషయాన్ని గ్రహించి 5% చేయడంతో పేద ప్రజలపై భారీగా భారం తగినట్లు అయింది. దీనితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కంచి మహేందర్ పిలుపుమేరకు భారీ స్థాయిలో బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ బిజెపి నాయకులు రఘు యాదవ్, సతీష్ గౌడ్, బానిష్, రఘు, శివ, ఉషారాణి, మహాలక్ష్మి, అశోక్, వినీత్ యాదవ్, బత్తి రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహిళ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి జన్మదిన శుభసందర్భంగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ రాజ్యలక్ష్మి ని శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్, 121 డివిజన్ ప్రెసిడెంట్ జ్యోతి, 122 డివిజన్ ప్రెసిడెంట్ నాగమణి, 123 డివిజన్ ప్రెసిడెంట్ విమల, మియాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ సుప్రజ, నాయకురాళ్లు సౌందర్య, లావణ్య, లక్ష్మమ్మ, పుట్టం దేవి, వల్లి రమణ, నాగ లక్ష్మీ, లక్ష్మీ, మణెమ్మ, సురేఖ, సరితా, జాబీన్, యస్మిన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్‌ను కలసిన సోమ శ్రీనివాస్ గుప్తా తదితరులు

## ఎమ్మెల్యేను కలసిన బాబుల్ రెడ్డి నగర్ వాసులు

బుద్వేల్, సెప్టెంబరు 9 (నమస్తే ఉదయం): మైలార్ దేవుపల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్ బస్తీకి చెందిన ప్రజలు మంగళవారం కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను ఆయన నివాసంలో కలసి తమ బస్తీ సమస్యల గురించి తెలిపి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మార్కొండయ నగర్ హనుమాన్ దేవాలయం నుండి బాబాల్ రెడ్డి నగర్ రాములు షాప్ వరకు డ్రేనేజీ, సీసీ రోడ్డు సమస్య చాల వున్నదన్నారు . సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యా క్రమము లో మాజీ వార్డ్ మెంబర్ సోమ శ్రీనివాస్ గుప్తా, పల్లపు జగన్, రవి ముదిరాజ్, ఓరుగంటి మల్లేష్, సురేష్, దుర్గాప్రసాద్, నవీన్ యాదయ్య, బక్కారెడ్డి , జహంగీర్, ఆంజనేయులు , రాకేష్ గిరి, పోలా ప్రభాకర్, రవిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాషా పరిరక్షణకు, ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడు కాళోజీ

## తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయం: జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం) తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయం అని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు తెలిపారు. ఈ రోజు కాళోజీ 111వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ%శీ% లో ఏర్పాటు చేసిన కాళోజీ గారి చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా ఎస్పీ గారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువ లేనివని, తెలంగాణ ప్రాంతంలోని ఎంతో మంది కవులకు స్ఫూర్తినిచ్చిన ఆదార్శనీకుడు కాళోజీ నారాయణ రావు అని, తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు, తన కవితలతో ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మాహనీయుడుగా అభివర్ణించారు. భారత దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ తో సన్మానింపబడిన ప్రజాకవి కాళోజీ గారి స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏ ఓ సతీష్




కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఆర్.ఐ. వెంకటేష్, ఐటీ సెల్ ఎస్.ఐ. సుకూర్, డి సి ఆర్ బి ఎస్.ఐ. బి. స్వాతి, కార్యాలయ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేపాల్ సుస్థిరత భారత్‌కు ఎంతో కీలకం

## హింసకు ముగింపు పలకాలని యువతను కోరిన మోడీ..!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)

నేపాల్‌లో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించడంపై ప్రధాని నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులను చూస్తుంటే తన మనసు చివుక్కుమంటోందని ఆయన అన్నారు. ప్రస్తుతం అగ్నిగుండంలా మారిన హిమాలయ దేశంలో సుస్థిరత, శాంతి, సంపద.. వంటివి భారత్ ప్రధాన ప్రాధామ్యాలు అని మోడీ తెలిపారు.

'నేపాల్‌లో హింసను చూసి మనసు తరుక్కుపోతోంది. ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోవడం చాలా



బాధేస్తోంది. నేపాల్‌లో సుస్థిరత, శాంతి, సంపద.. వంటివి భారత్ ప్రథమ ప్రాధాన్యాలు. ఆ దేశంలోని సోదరులు, సోదరీమణులు.. అందరిని శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని మోడీ ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించారు. మంగళవారం ఉదయం ప్రధాని వరదలకు తీవ్రంగా నష్టపోయిన పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భద్రతా సమావేశంలో క్యాబినెట్ కమిటీ నేపాల్‌లోని పరిస్థితులను చర్చించిందని మోడీ తెలిపారు. దేశంలో అవినీతి, బంధుప్రీతి, సోషల్ మీడియాపై నిషేధం.. ఈ మూడు కారణాల వల్ల నేపాల్ యువత భగ్గుమంది. సెప్టెంబర్ 8 నుంచి వారు ఆందోళనలకు దిగారు. మంగళవారం జరిగిన అల్లర్లలో, హింసలో.. 22 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కిన యువత పార్లమెంట్, అధ్యక్ష భవనంతోపాటు సుప్రీంకోర్టును కూడా తగలబెట్టారు. దేశవ్యాప్తంగా అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేశారు

# విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించాలి

మల్దకల్, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం)విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం, అన్ని సౌకర్యాలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మల్దకల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మరియు జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి 100 శాతం హాజరు ఉండేలా చూడాలని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు మెనూ ప్రకారం ప్రతి రోజు పౌష్టికాహారం ఇవ్వాలని, ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. వంట కోసం తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. వంటశాల ప్రదేశం,వంట పాత్రలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థుల హాజరును సాంకేతికంగా పర్యవేక్షించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను నిత్యం వినియోగించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ ప్రతి 15



రోజులకు పాఠశాల నిర్వహణ తనిఖీ చేసి రిమార్కులు అందిస్తున్నారని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. 10వ తరగతి చదువుతున్న అనాథ విద్యార్థినితో ప్రత్యేకంగా మాట్లాడి, హాస్టల్‌లో అన్ని వసతులు, సౌకర్యాలు అందిస్తున్నట్లు పేర్కొని,కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అయిజ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్

అయిజ, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం)పాఠశాల సమయం ముగియకముందే విద్యార్థులను ఇంటికి పంపిన కారణంగా ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. మంగళవారం అయిజ కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలుర పాఠశాల)లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా పాఠశాల సమయములో విద్యార్థులందరూ గైర్హాజరుగా ఉన్నారు. దీనిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ఇది ప్రభుత్వ సెలవు కాదు. అధికారికంగా కూడా ఎటువంటి సెలవు లేదు. అయితే విద్యార్థులను అనుమతి లేకుండా విద్యార్థులను ఇంటికి ఎందుకు పంపించారు?" అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. దీనికి ఉపాధ్యాయులు, "ఈ రోజు మాల పున్నమి కావడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లారు" అని సమాధానం ఇచ్చారు. అయితే దీనిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "ప్రభుత్వం ప్రకటించని సెలవును మీరు ఎలా ఇస్తారు? పిల్లలు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి బోధన పొందాలి. మీరు ప్రోత్సహించకపోతే విద్యార్థులు చదువు ఎక్కడ నేర్చుకుంటారు?" అని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషపాణి శర్మను సస్పెండ్ చేయాలని జిల్లా విద్యాధికారికి కలెక్టర్ ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను స్వయంగా పరిశీలించారు. ప్రతి రోజు ఉ



పాధ్యాయులు, విద్యార్థులందరూ 100 శాతం హాజరుగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని,ఆ దిశగా కృషి చేసి వంద శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాములు, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులతో సమావేశమైన అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు

# మిలాదున్ నబి ర్యాలీని శాంతియుతంగా నిర్వహించాలి

## అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు

బుద్వేల్ , సెప్టెంబరు 9 (నమస్తే ఉదయం) : ఈనెల 14న రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నౌ నెంబర్, పహాడి , హసన్ నగర్, సులేమాన్ నగర్ చింతల్ మెట్, వాజేంద్రనగర్ ప్రాంతాల్లో నిర్వహించనున్న మిలాద్ ఉన్ నబి ర్యాలీని శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు ముస్లిం సోదరులను కోరారు. మంగళ వారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో ముస్లిం సోదరులతో ఆయన సమావేశం నిర్వహించారు. ర్యాలీలు, ఊరేగింపులు ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఇతర వర్గాల ప్రజలు కూడా ముస్లిమ్ సోదరులకు సహకరించాలన్నారు.




# మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

## బాలానగర్ సీఐ నర్సింహా రాజు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 9 (నమస్తే ఉదయం)సెప్టెంబర్ 13న నిర్వహించనున్న మెగా లోక్అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు పిలుపునిచ్చారు. ఈ నెల 8నుండి 13 వరకు నిర్వహించనున్న లోక్అదాలత్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేరకు లోక్అదాలత్ తో విలువైన సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుందన్న విషయాన్ని పేర్కొన్నారు. ఈ సందర్బంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ రాజీయే రాజ మార్గమన్నారు.. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృదా చేసుకోవద్దన్నారు. న్యాయ శాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు సంభందిత పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు న్యాయశాఖ పని చేస్తుందన్నారు. అధిక సంఖ్యలో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, బ్యాంకులకు సంబంధించి కేసులను లోక్అదాలత్‌లో ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు.



# గద్వాల్‌లో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9(నమస్తే ఉదయం)గద్వాల్ లోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నందు ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణా భాషాదినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. మీనాక్షి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసిన కాళోజిని గౌరవిస్తూ ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. తెలంగాణలో జరిగిన ప్రతి ఉద్యమంలో ఆయన పాల్గొని ప్రజల పక్షాన నిలబడి, నిజాంకు వ్యతిరేకంగా తన కలాన్ని, గలాన్ని వినిపించి జైలుపాలు అయ్యాడని గుర్తు చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిజి. లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ. మాతృభాషా తెలుగులో ఉన్న తియ్యదనాన్ని గుర్తుచేస్తూ, పరభాషాజ్ఞానం ఉన్నప్పటికి తెలుగులోనే మాట్లాడి భాషాభిమానాన్ని పెంచుకోవాలని, తెలుగు భాషాసాహిత్యాన్ని అధ్యయనం చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733